లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహించొద్దు

రికార్డులు పరిశీలిస్తున్న సెక్రటరీ నరేశ్

బయ్యారం, ఫిబ్రవరి 7 : మార్కెట్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని ఇల్లందు వ్యవసాయ మార్కెట్(గ్రేట్-3) సెక్రటరీ నరేశ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని మార్కెట్ చెక్ పోస్టును ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమ వ్యాపారాన్ని అరికట్టి ఇల్లందు మార్కెట్ ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2024 - 25 ఏడాదికి సంబంధించి మార్కెట్ టార్గెట్ 4.64కోట్లు కాగా ఇప్పటికే రూ.3.80కోట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మార్కెట్ పరిధిలోని బొమ్మనపల్లి, రొంపేడ్, ముచ్చర్ల, బయ్యారం చెక్ పోస్టులకు సంబంధించి ఏడాది రూ.98.85లక్షల సెస్ వసూలు చేసినట్లు తెలిపారు. మార్చి టార్గెట్ పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం కొత్తపేటలో లైసెన్స్ వ్యాపారి వద్ద రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రంజిత్ పాల్గొన్నారు.

బాలాజీ నర్సింగ్ హోంలో తనిఖీ

బాలాజీ నర్సింగ్ హోమ్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి మురళీధర్

తొర్రూరు, ఫిబ్రవరి 7 : తొర్రూరు మండల పరిధిలోని బాలాజీ నర్సింగ్ హోమ్‌ను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మురళీధర్ తనిఖీ చేశారు. బుధవారం కంటయపాలెం గ్రామానికి చెందిన 16యేళ్ల బాలుడు సిద్ధార్థ వైద్యం పొందుతూ మృతి చెందిన ఘటనపై విచారణలో భాగంగా ఈ తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుధీర్‌రెడ్డి, డాక్టర్ సారంగం, జిల్లా మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, కేవీ రాజు పాల్గొన్నారు.

హాస్పిటల్‌లో పనిచేస్తున్న వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, ఇతర సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. రిజిస్టర్లు, హాస్పిటల్‌లో ఉండాల్సిన వసతులపై సమగ్ర పరిశీలన చేశారు. ఈ తనిఖీ సమయంలో తొర్రూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్వలిత, డాక్టర్ మీరాజ్ కూడా పాల్గొన్నారు. హాస్పిటల్‌లో అవసరమైన వసతులు, వైద్యసేవలపై సూచనలు ఇచ్చినట్లు సమాచారం.

విద్యార్థుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం

జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

తొర్రూరు ఫిబ్రవరి 7 : విద్యార్థుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. శుక్రవారం ఆయన తొర్రూరు డివిజన్ కేంద్రంలోని సమీకృత వసతి గృహం, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, డైనింగ్ హాల్, మూత్రశాలలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రుచికరమైన పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ శైలజ, మున్సిపల్ మేనేజర్ కట్టా స్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొమ్ము దేవేందర్, హెల్త్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

బీసీలు బానిసత్వం వీడాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 : బీసీలు బానిస బతుకుల నుంచి విముక్తి పొందాలని, మహాత్మజ్యోతిరావు పూలే నేషనల్ అవార్డు గ్రహీత, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్‌సెంటర్‌లో జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్ ఆధ్వర్యంలో సమగ్ర కుల గణ సర్వే తప్పులపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో మురళీధర్ కమిషన్ 52శాతం జనాభా ఉందని చెప్పిందని, మరి 2024లో 46శాతానికి ఎలా తగ్గుతుందన్నారు. బీసీ కులగణనకు రెడ్డి సామాజిక వర్గం మంత్రిని చైర్మన్‌గా పెట్టడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు ఇంత అన్యాయం జరుగుతున్నా శాసన సభలో బీసీ ఎమ్మెల్యే ఒక్కరు కూడా మాట్లాడలేదన్నారు. మళ్లీ పారదర్శకంగా సర్వే చేసిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాజేందర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీధర్, జంపన్న, శ్రవణ్, శ్రీను, సతీశ్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్
- అయోధ్యపురంలో ముఖ్యకార్యకర్తలతో సమావేశం

పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 7 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులదే విజయమని మాజీ ఎంపీ, ప్రణాళిక సంఘం మాజీ చైర్మన్ బోయిన పల్లి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అయోధ్యపురం గ్రామంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వందరోజుల్లో అమలు చేస్తామని చేతులెత్తేసిందన్నారు. అలవికాని హామీలతో ప్రజలను మోసం చేసిందని అన్నారు. రైతులను, మహిళలను, విద్యార్థులను ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా మోసం చేస్తూనే ఉందన్నారు. కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం పాలనలో ఫెయిలైందన్నారు. రాబోవు రోజులన్నీ బీఆర్ఎస్ పార్టీవేనని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ పాలనలో వైఫల్యం చెందిందని, ప్రజలు ఈ ప్రభుత్వంతో నిరాశలో ఉన్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులే విజయం సాధిస్తారని తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే ప్రతి నాయకుడిని, కార్యకర్తని పార్టీ అధినేత తప్పకుండా గుర్తిస్తారని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, మాజీ వైస్ఎంపీపీ ఆరె వీరన్న, మాజీ ఎంపీటీసీ బోడ కిషన్, మాజీసర్పంచ్ తులసీరాం, నాయకులు తంగళ్లపల్లి లక్ష్మీనారాయణ, బెజ్జం రమేశ్, స్టాలిన్, సుధాకర్, యాకయ్య, రవీందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

గూడూరు, ఫిబ్రవరి 7 : ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రమీలరావు వైద్యులకు సూచించారు. శుక్రవారం మండలంలోని తీగలవేణి గ్రామ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం దవాఖానను, పరిసరాలను పరిశీలించి తగిన సూచలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ గీత, వైద్యులు రాంబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

కురవి, ఫిబ్రవరి 7 : కురవి మండలం గుండ్రాతిమడుగు(విలేజ్) గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, దూడల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పశువైద్య అధికారి డాక్టర్ రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో 94పశువులు రాగా 49ఎదకురాని, 32దూడలకు నట్టల నివారణ మందులు, మూడు పశువులకు గర్భకోశ వ్యాధులకు, 10పశువులకు సాధారణ చికిత్సలు అందించారు. ఈ శిబిరంలో జేవీవో ఏ రేవతి, వీఏ సంధ్య, మహబూబాబాద్ ఏరియా గోపాలమిత్ర సూపర్‌వైజర్ కరిమిళ్ల రఘువీర్, గోపాలమిత్రులు భూక్యా భాస్కర్, పిట్టల కృష్ణ, పశుమిత్ర సుజాత, గ్రామంలోని పాడి రైతులు పాల్గొన్నారు.

ఎస్సై శివకుమార్‌కు ప్రతిష్టాత్మక ట్రోఫీ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 : సెంట్రల్ ఫింగర్ ప్రింట్ బ్యూరోలో నియమితులై పోలీసులకు నిర్వహించే ఆల్ ఇండియా బోర్డ్ పరీక్షలో తెలంగాణ రాష్ట్రం తరుపున జిల్లాలో ఫింగర్ ప్రింట్ యూనిట్ ఎస్సై శివకుమార్ ప్రథమ స్థానంలో నిలిచారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి నిత్యానందారాయ్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన ఖాన్ బహదూర్ అజిజుల్ హాకీ ట్రోఫీని అందుకున్నారు. నేర పరిశోధన విభాగం డీజీపీ శిఖాగోయల్, రాష్ట్ర ఫింగర్ ప్రింట్ బ్యూరో డైరెక్టర్ తాతారావు, జిల్లా ఎస్పీ సుదీర్‌రాంనాథ్ కేకన్ ఎస్సై శివకుమార్‌ను అభినందించారు.

పసుపును పరిశీలిస్తున్న విజయనిర్మల

సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలి

కేసముద్రం , ఫిబ్రవరి 7 : రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ విధానంలో సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల సూచించారు. కల్వల గ్రామంలో రైతు దామోదర్‌రెడ్డి సేంద్రియ విధానంలో సాగు చేసిన పసుపు, పప్పుదినుసుల పంటలను ఆమె శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. అనంతరం డిజిటల్ క్రాఫ్ బుకింగ్‌ను పరిశీలించారు. డివిజన్ వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఏవో వెంకన్న, రైతులు దామోదర్‌రెడ్డి, సుధాకర్, ఏఈవో లావణ్య పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పెద్దవంగర, ఫిబ్రవరి 7 : రైతులు సాగు చేస్తున్న పంటల్లో వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, ఎరువుల షాపుల యాజమాన్యలు తప్పక నిబంధనలు పాటించాలని మరిపెడ ఏడీఏ విజయ్ చంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని పోచంపల్లి, అవుతాపురం, పెద్దవంగర గ్రామాల్లోని పంట క్షేత్రాల్లో రైతులతో మాట్లాడి, అనంతరం ఎరువుల షాపులను తనిఖీ చేశారు. రికార్డులను, నిల్వ ఉన్న స్టాక్‌ను పరిశీలించి మాట్లాడారు. స్టాకు వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఏవో స్వామి, ఏఈవోలు రాజు, యశస్వినీ, విశ్వశాంతి, రైతులు పాల్గొన్నారు.

ఆశ్రమ, ఏకలవ్య పాఠశాలల్లో కలెక్టర్ తనిఖీ

కురవి, ఫిబ్రవరి 7 : కురవి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, క్లాస్‌రూమ్‌లు, పరిసరాలు, స్టోర్స్, వంట గదులను తనిఖీ చేశారు. వంట సిబ్బందికి పలు సూచనలు చేశారు. వార్డెన్లు, ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, ఆర్సీవోలు నిత్యం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

తీన్మార్ మల్లన్నపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

మరిపెడ, ఫిబ్రవరి 7 : ఇటీవల వరంగల్ నిర్వహించిన సమావేశంలో రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శాసనమండలి సభ్యులు తీన్మార్ మల్లన్నపై మరిపెడ రెడ్డి సామాజికవర్గం నాయకులు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంతోపాటు అన్ని వర్గాల ప్రజల మనోభావాలు దెబ్బతీసిందన్నారు. తీన్మార్ మల్లన్న తీరును ఖండిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు గాదె అశోక్‌రెడ్డి, వెర్మరెడ్డి నర్సిరెడ్డి, గంట్ల సుధాకర్‌రెడ్డి, చాపల శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలకిషన్ ఆత్మహత్య ప్రభుత్వ హత్యే

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీ మాలోత్ కవిత

బాలకిషన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ మాలోత్ కవిత

కురవి, ఫిబ్రవరి 7 : కురవి మండలంతు ల్యాతండా పంచాయతీ పరిధిలోని హుమ్లాతండాకు చెందిన బానోత్ బాలకిషన్(38) ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనని మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. శుక్రవారం ఆమె తండాకు చేరుకుని మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు. కేసీఆర్ ప్రభుత్వంలో హాయిగా బతికిన రైతు కాంగ్రెస్ హామీలతో అతలాకుతలం అవుతోందన్నారు. మృతుడు బాలకిషన్ తన మూడెకరాల్లో ఎకరం వరి, రెండు ఎకరాల్లో అప్పు చేసి మిర్చి సాగు చేస్తే దిగుబడి రాక అప్పులు పెరిగాయన్నారు. ఆర్థిక సమస్యలతో కుంగిపోయి ఇంటి ఆవరణలో ఈనెల 5న గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోత్ రవినాయక్, ముత్యం వెంకన్నగౌడ్, మహబూబ్ పాషా, రాజునాయక్, రమేశ్‌నాయక్, గణేశ్‌నాయక్ పాల్గొన్నారు.

తెరుచుకోని రైతు సేవా కేంద్రం

యూరియా కోసం రైతుల ఇబ్బందులు

మూసి ఉన్న పీఏసీఎస్ రైతు సేవాకేంద్రం

నర్సింహులపేట ఫిబ్రవరి 7 : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు సేవా కేంద్రం శుక్రవారం తెరువకపోవడంతో యూరియా కోసం వచ్చిన రైతులు వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కొందరు ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూడాల్సి వచ్చింది. గోపతండాకు చెందిన రైతు అజ్మీరా వంశీ మాట్లాడుతూ యాసంగి పొలంలో యూరియా వేసేందుకు ఐదుగురం రైతులం రూ.వెయ్యి కిరాయి చెల్లించి మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు సేవా కేంద్రానికి ఉదయం 10గంటలకు వచ్చాం. రైతు సేవా కేంద్రం తెరువకపోవడంతో పలు మార్లు పీఏసీఎస్ సీఈవోకు ఫోన్ చేశామన్నాడు. మధ్యాహ్నం 2తరువాత రేపు రమ్మనడంతో వెనుతిరిగామన్నాడు. బయట ఎక్కువ ధర ఉందని ఇక్కడికి వస్తే ట్రాక్టర్ కిరాయి దండుగైందని ఆవేదన వ్యక్తం చేశారు.

నులిపురుగుల నిర్మూలనపై శిక్షణ

కురవి, ఫిబ్రవరి 7 : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈనెల 10న ఒక సంవత్సరం నుంచి 19యేళ్ల వయసు గల చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు అందించాలని బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్రవంతి తెలిపారు. బలపాల పీహెచ్‌సీ ఆవరణలో పారామెడికల్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల సైన్స్ టీచర్లు, ఆశా కార్యకర్తలకు శుక్రవారం ఒకరోజు నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ అర్హులైన పిల్లలకు అల్బెండజోల్ మాత్రను అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ యశస్విని, డాక్టర్ కరుణాకర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భద్రమ్మ, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆరోగ్య విస్తరణ అధికారి స్వామి, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ శోభ, హెల్త్ సూపర్‌వైజర్ ఏసుమని, పాఠశాల సైన్స్ టీచర్ జయశ్రీ పాల్గొన్నారు.

దంతాలపల్లిలో..

దంతాలపల్లి : ఈ నెల 10న నులిపురుగుల నివారణ మాత్రలను పిల్లలకు సక్రమంగా అందించాలని తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో వివేక్‌రాం, ఎంపీవో అప్సర్‌పాషా, డాక్టర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

సొల్ల తండాను సందర్శించిన జర్మని దేశస్తురాలు

నెల్లికుదురు, ఫిబ్రవరి 7 : మండలంలోని సొల్లతండాను జర్మనీ దేశస్తురాలు మౌనిక రాటేరింగ్ శుక్రవారం సందర్శించారు. తండాలో బానోత్ విజయ్ సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. సాగు గురించి అడిగి తెలుసుకున్నారు. మొక్కజొన్న పంటలో కలియతిరిగి చూశారు. గోవుల షెడ్డు నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తానని తెలిపారు. పంట పొలాలు ఆహ్లాదకరవాతావరణాన్ని, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఇస్తున్నాయని ఆమె అన్నారు.

మాజీ ఎంపీ కవితను కలిసిన మల్లేశ్

నెల్లికుదురు, ఫిబ్రవరి 7 : మండల కేంద్రానికి చెందిన వీరగాని మల్లేశ్‌గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవితను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై మండల కేంద్రం నెల్లికుదురు పరిస్థితిపై జిల్లా అధ్యక్షురాలితో మాట్లాడినట్లు తెలిపారు.

ఘనంగా ఎదుర్కోలు ఉత్సవం

డోర్నకల్, ఫిబ్రవరి 7 : పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 18వ బ్రహ్మోత్సవాలల్లో భాగంగా శుక్రవారం స్వామి ఎదుర్కోలు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఎదుర్కోలు ఉత్సవాన్ని వీక్షించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు.

ఎన్‌హెచ్ రోడ్డులో భూమి పోతుందని రైతు ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతున్న గోపీ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 : ఓ రైతు తను వ్యవసాయం చేసుకునే భూమి ఎన్‌హెచ్ రహదారి కింద పోతుందని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన ప్రకారం.. గత రెండు రోజుల క్రితం పట్టణ శివారులోని సలార్‌తండా మీదుగా ఎన్‌హెచ్ 930పీ (నల్గొండ జిల్లా) వలికొండ నుంచి భద్రాచలంకు వరకు వెళ్లే రహదారి కోసం అధికారులు సర్వే చేశారు. అదే రోజు రైతులు వ్యవసాయ భూములు ఇవ్వమని అధికారులను అడ్డుకున్నారు. మళ్లీ అధికారులు హద్దులు ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్న క్రమంలో సలార్‌తండాకు చెందిన భూక్యా గోపీ అనే రైతు శుక్రవారం మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఏరియా ఆస్పిటల్‌కు తరలించినట్లు స్థానికులు, బంధువులు తెలిపారు.

సైబర్ వలలో పడి 5.90లక్షలు మాయం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 : సైబర్ వలలో పడిన ఓ యువకుడి తన ఖాతాలో నుంచి రూ.5.90 లక్షలు పోగొట్టుకున్న ఘటన పట్టణంలో చోటుచేసుకున్నది. టౌన్ సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హనుమంతరావునగర్ కాలనీకి చెందిన ఓ యువకుడు కొంతకాలంగా తన వాట్సప్ నంబర్‌కు వచ్చిన లింక్ ద్వారా గేమ్ ఆడుతున్నాడు. ఈ క్రమంలో ఒకసారి పోస్‌పే ద్వారా రూ.90వేలు, తన బ్యాంకు ఖాతా నుంచి రూ.5లక్షలు మాయమైనట్లు గుర్తించాడు. మళ్లీ టాస్క్ ఇవ్వటంతో సైబర్ వలలో పడి మోసపోయినట్లు గుర్తించి బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోవద్దన్నారు.

బోనాలతో మొక్కులు తీర్చుకుంటున్న గిరిజన మహిళలు

101బోనాలతో అమ్మవారికి మొక్కులు

కురవి, ఫిబ్రవరి 7 : కురవి మండల కేంద్రంలోని భద్రకాళీఅమ్మవారికి నర్సింహులపేట మండలం నాగారం శివారు గోపాతండా వాసులు 101బోనాలతో మొక్కులు తీర్చుకున్నారు. గిరిజన సాంప్రదాయ డప్పులతో ఒకేసారి బయలుదేరడంతో ప్రజలు, భక్తులు తిలకించారు. ప్రతి ఏడు శివరాత్రి ముందు అమ్మవారికి, స్వామి వారికి మొక్కులు చెల్లించడం పూర్వీకుల నుంచి ఆనవాయితీగా వస్తోందని మహిళలు తెలిపారు.

కోలాటంతో ప్రణమిల్లిన కళాకారులు

తమ ఇష్ట దైవమైన కురవిలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి సన్నిధిలో కోదాడ పట్టణం శాంతినగర్‌కు చెందిన ఆరె శ్రీనివాస కోలాట బృందం కళాకారులు తమ గురువు సమక్షంలో ఆటపాటలతో మొక్కులు తీర్చుకున్నారు. గురువు లింగయ్యయాదవ్ మాట్లాడుతూ తాను 30యేళ్ల నుంచి కోలాటం నేర్చుతున్నానని, ప్రతి సంవత్సరం కోలాటం నేర్చుకుని వెళ్లిపోయే కళాకారులు స్వామి వారి సన్నిధిలో ఆడడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

కేటీఆర్ సేన జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడిగా తరుణ్‌నాయక్

కేసముద్రం , ఫిబ్రవరి 7 : కేటీఆర్ సేన మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడిగా కేసముద్రం మండలం సబ్‌స్టేషన్‌తండాకు చెందిన వాంకుడోత్ తరుణ్‌నాయక్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తరుణ్‌నాయక్ మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కేటీఆర్ సేన కృషి చేస్తుందని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, సత్యవతిరాథోడ్, జిల్లా అధ్యక్షురాలు కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

ఇనుగుర్తి/నెల్లికుదురు, ఫిబ్రవరి 7 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టేట్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ డా.బి.రవీందర్ నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు, ల్యాబ్, ఔషధశాలను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. డీఎంహెచ్‌వో మురళీధర్, వైద్యాధికారులు సుధీర్‌రెడ్డి, సారంగం పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మరిపెడ, ఫిబ్రవరి 7 : వరకట్న వేధింపులకు గురిచేస్తున్న మట్టి హరీశ్‌పై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం ఎస్సై సతీశ్ తెలిపారు. పురుషోత్తమాయగూడెంకు చెందిన వంగూరు నాగలక్ష్మికి కొడకండ్ల మండలం నర్సింగాపురానికి చెందిన మట్టి హరీశ్‌తో 5యేళ్ల క్రితం వివాహమైంది. వివాహ అనంతరం నుంచి అదనపు కట్నం పోసం వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి రిమాండ్

డోర్నకల్, ఫిబ్రవరి 7 : భార్య, కుమారుడిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ భూక్యా రాజేశ్ తెలిపారు. ఈ నెల 5న పెరుమాండ్ల సంకీసకు చెందిన నీరుడి మహేశ్ భార్య శిరీష, కుమారుడు రిషిక్‌పై డీజిల్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. శిరీష ఫిర్యాదు మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజేశ్ తెలిపారు.

లారీ, ఆటో ఢీ..ముగ్గురికి గాయాలు

మరిపెడ, ఫిబ్రవరి 7 : లారీ, ఆటో ఢీకొని ముగ్గురికి గాయాలైన ఘటనలో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం మేడిదపల్లి గ్రామానికి చెందిన కొమ్మనబోయిన దేవయ్య, భార్య చంద్రమ్మ, మనవరాలు బంక సమంతలు ముగ్గురు కలసి పని మీద మరిపెడ మండల కేంద్రానికి ప్యాసింజర్ ఆటోలో వస్తున్నారు. ఈ నేపథ్యంలో తొర్రూర్ నుంచి ఖమ్మం వెళ్తున్న లారీ డ్రైవర్ రాంగ్ రూట్లో వచ్చి ఆటోను ఢీ కొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సమంతకు పరిస్థితి విషమించడంతో చిక్సిత నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

డోర్నకల్, ఫిబ్రవరి 7 : డోర్నకల్‌కు చెందిన రమేశ్ పెండింగ్ బిల్లులు విషయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయిపై దాడి చేశాడు. బాధితుడు సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ భూక్యా రాజేశ్ తెలి